క్లుప్తంగా

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న మల్లీశ్వరి

కాకినాడ రూరల్: వయసు పెరుగుతున్న వారు పోషక విలువలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం సంపూర్ణమవుతుందని పోషకాహార నిపుణురాలు మల్లీశ్వరి అన్నారు. స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బుధవారం ఆమె సమతుల ఆహారంపై వృద్ధులకు అవగాహన కల్పించారు. గుడ్లు, తాజా పండ్లు, కాయగూరలు అధికంగా తీసుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రోటీన్లు ఉంటే ఆహారంతో శరీరానికి అవసమయ్యే విటమిన్లు, మినరల్స్ అందుతాయన్నారు. భోజనంలో అన్నం కంటే కూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు,

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న ప్రతినిధులు

కాకినాడ క్రైం: పదో తరగతి టాపర్లయిన ఇద్దరు పేద విద్యార్థుల చదువుకు శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. బుధవారం స్థానిక భానుగుడిలో నగరానికి చెందిన అంబికా అక్వేరియం రెస్టారెంట్ అధినేతలు కోన సతీష్, ప్రశాంతి సామాజిక బాధ్యతతో రూ.40 వేల సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని ఏలేశ్వరానికి చెందిన ఎం.అఖిల, వేములపాలేనికి చెందిన టి.బాంధవికి రూ.20 వేల చొప్పున టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, దాతలు సతీష్, ప్రశాంతి, సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ అందించారు. ఈ సందర్భంగా నవీన్ తన వంతుగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

మోటూరుకి సీపీఎం నేతల నివాళి



మోటూరు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: కమ్యూనిస్టు నేత కామ్రేడ్ మోటూరు హనుమంతరావు వర్ధంతి సందర్భంగా సీపీఎం కాకినాడ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సుందరయ్య భవన్‌లో నివాళులర్పించారు. సీపీఎం జిల్లా, నగర నాయకులు వర్మ, ప్రసాద్ తొలుత మోటూరు హనుమంతరావు చిత్రపటానికి పూలమాల వేసి, జోహార్లర్పించారు. సీపీఎం జిల్లా సెంటర్ శాఖ కార్యదర్శి కె.వీరబాబు మాట్లాడుతూ, మోటూరు హనుమంతరావు వక్తగా, రచయితగా, పత్రికా సంపాదకులుగా, ప్రజానేతగా, ప్రజాప్రతినిధిగా సేవలందించారని కొనియాడారు. ఏపీలో శాసన సభ సభ్యుడిగా, శాసన మండలి సభ్యుడిగా, రాజ్య సభ సభ్యుడిగా ప్రజావాణి వినిపించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నాయకులు మలక వెంకట రమణ, మేడిశెట్టి వెంకటరమణ, భూలక్ష్మి, రాణి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

సామర్లకోట: రోడ్డు ప్రమాదాలు ఇటీవల కాలంలో పెరిగిపోయిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం స్థానిక స్టేషన్ సెంటర్‌లో వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరిగాయి. మద్యం సేవించి వాహనాలు నడపడంతో ఎదుటివారు ప్రమాదాలకు గురవుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తెలిపారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్	:	హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్, భైరవం, థగ్ లైఫ్, శుభం
దేవీ మల్టీప్లెక్స్	:	అందాల రాక్షసి, శుభం, భైరవం, థగ్ లైఫ్
లక్ష్మి	:	హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్, ఫ్రం ది వరల్డ్ ఆఫ్ జాన్‌విక్ బాలెరినా
సత్యగౌరి	:	ఫ్రం ది వరల్డ్ ఆఫ్ జాన్‌విక్ బాలెరినా
తిరుమల	:	థగ్ లైఫ్
సీఅండ్‌సీ	:	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సీఅండ్‌సీ–2	:	పాపా (ఓ నాన్న)
శ్రీప్రియ	:	తొలిప్రేమ
పద్మప్రియ	:	భైరవం

మాఫియాపారం

- శ్రీ మాటున పేట్రేగుతున్న అక్రమార్కులు
- కరప మీదుగా 60 ట్రాక్టర్ల రాకపోకలు
- నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కరపలో మట్టి లోడును రవాణా చేస్తున్న ట్రాక్టర్

కరప: రైతులను మభ్యపెట్టి.. అన్నీ ఫ్రీ అంటూ నమ్మించి మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. భారీగా మట్టిని కొల్లగొడుతూ.. అక్రమార్జనకు పాల్పడుతోంది. రేయింబవళ్లు ఓ లెక్కన ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ట్రాక్టర్ల మోతతో పగలు ట్రాఫిక్ స్తంభించిపోతుంటే, రాత్రుళ్లు కంటిపై కునుకు ఉండటం లేదని పలువురు వాపోతున్నారు. దీనిని పట్టించుకోని అధికారుల తీరుకు ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికార కూటమి నాయకుల అండదండలతోనే మట్టి వ్యాపారం జోరుగా సాగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కరపలో మట్టి మాఫియా ఆగడాలు ఇష్టారాజ్యంగా మితిమీరుతున్నాయి.

మండలంలోని కరప, పేపకాయలపాలెం, కొరుపల్లి, అరట్లకట్ట, వేములవాడ, యండమూరు, వేళంగి, పెద్దాపురప్పాడు తదితర గ్రామాల్లోని భూములు కాలువల శివారున, మెరక ప్రాంతాల్లో ఉన్నాయి. మెరక భూములకు సాగునీరు ఎక్కకపోవడంతో, సాగు చేసుకోవడానికి అష్టకష్టాలు పడుతుంటారు. ఇలాంటి భూములకు నీరు తోడుకోవాల్సి ఉంటుంది. తోడుకోవడానికి అదనపు పెట్టుబడులు తప్పవు. అందుకే వేసవి కాలం వచ్చిందంటే రైతులు తమ పొలాల్లో మెరక పల్లాలు తీసుకోవడానికి ప్రాధాన్యమిస్తారు. రైతులు తమ పొలాల్లో మెరక తీసుకోవాలంటే కూలీలను పెట్టి తవ్వించుకుంటారు. పల్లపు భూముల్లోకి, గృహాల ఆవరణలు ఎత్తు చేసుకోవడానికి, ఇంటి పునాదులకు ట్రాక్టర్లతో మట్టిని తోలిస్తారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగి, తవ్వడానికి పొక్లెయిన్లు, రవాణాకు ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చాయి. మళ్లల్లో మట్టిని పొక్లెయిన్‌తో తవ్వి, ట్రాక్టర్లలో వేస్తారు. ఆ ట్రాక్టర్ల ద్వారా ఎవరికి మట్టి అవసరమో వారికి మట్టి మాఫియా సరఫరా చేస్తోంది. మట్టి మాఫియా గ్రామాల్లో తిరిగి, ఎవరికి మట్టి అవసరమో సమాచారం సేకరిస్తారు. ఇంటి పునాదుల్లోకి, గృహాల ఆవరణలు మెరక చేసుకోవడానికి మట్టి తోలుతుంటారు. లేకపోతే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ఇటుక బట్టీలకు రవాణా చేస్తుంటారు.

ఉచితం ముసుగులో..

రైతులను కలిసిన మట్టి మాఫియా.. పొలాల్లో మెరక తీయాలంటే ఉచితంగా తవ్వేస్తాం, ఒక్క రూపాయి కూడా ఇవ్వక్కర్లేదని చెబుతున్నారు. తవ్విన తర్వాత ట్రాక్టర్ బ్లేడ్‌తో చదును చేయిస్తామని, అవసరమైతే నీరు పెట్టాక కాయదమ్ము కూడా చేస్తామని మట్టి మాఫియా బేరం కుదుర్చుకుంటోంది. పెట్టుబడి పెట్టకుండానే పొలంలో మెరక తీసి, చదును చేస్తారు కదా అని కొందరు రైతులు అంగీకరిస్తున్నారు. ఇలా ఫ్రీ పేరు చెప్పి మట్టి మాఫియా చెలరేగిపోతున్నారు.

గ్రూపులుగా..

కరప, కొరుపల్లి, పేపకాయలపాలెం, అరట్లకట్ట, పెద్దాపురప్పాడు, నడకుదురు, గొర్రిపూడి, పెనుగుదురు తదితర గ్రామాల్లో మట్టి మాఫియా గ్రూపులున్నాయి. చాలా గ్రామాల్లో మట్టి వ్యాపారం చేసేవారు దాదాపుగా 50, 60 మంది వరకు ఉన్నారు. వీరు రైతులను, హౌసింగ్ లబ్ధిదారులను, ఇటుక బట్టీ, రియల్ ఎస్టేట్ వ్యాపారులను కలిసి డీల్ కుదుర్చుకుంటారు. అద్దె ట్రాక్టర్లను పెట్టుకుని రేయింబవళ్లు అదే పనిగా పొలాల్లో మట్టిని తవ్వేసి, రవాణా చేస్తుంటారు. దూరాన్ని బట్టి ట్రాక్టర్ ట్రిప్‌కు రూ.750 నుంచి రూ.900 వరకు రేటు నిర్ణయించారు. పొక్లెయిన్ అద్దె, ట్రాక్టర్ల కిరాయి వంటి ఖర్చులు పోను మట్టి మాఫియాకు ట్రిప్‌కు రూ.400 నుంచి రూ.500 వరకు మిగులుతోంది. దీంతో మట్టి వ్యాపారం చేసేవారు పెరిగిపోయారు. రైతులను కలిసి డీల్ రాబట్టుకోవడానికి అవసరమైతే ఫ్రీగా దమ్ము చేసిపెడతామని ఆఫర్లు కూడా ఇస్తున్నారు.

తహసీల్దార్ వివరణ

కరప, పరిసర గ్రామాల్లో జరుగుతున్న మట్టి తవ్వకాలు, జోరుగా సాగుతున్న మట్టి వ్యాపారానికి ఎవరికైనా అనుమతులిచ్చారా అని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణని వివరణ కోరగా, ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. రైతులు తమ పొలాల్లో మెరక తీసుకునేవారు దరఖాస్తు చేసుకుంటే మైనింగ్ శాఖకు పంపిస్తామన్నారు. ఇప్పటివరకు ఇద్దరు దరఖాస్తు చేసుకుంటే, ఆ శాఖకు పంపించామని చెప్పారు. మట్టి తవ్వకానికి మైనింగ్ శాఖ నుంచే అనుమతులు తీసుకోవాలని తహసీల్దార్ వివరణ ఇచ్చారు.

ట్రాఫిక్‌కు అవాంతరాలు

పొలాల్లో మెరకతీసిన మట్టిని కరప మీదుగా ఇతర గ్రామాలకు, ఇటుక బట్టీలకు, అనధికార లే–అవుట్లకు ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నారు. మండలంలో 100 నుంచి 150 ట్రాక్టర్లు ప్రయాణిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మట్టి ట్రాక్టర్లు ప్రతి పది నిమిషాలకొకటి వంతున తిరుగుతుండటంతో పేపకాయలపాలెం రోడ్డుపై ప్రయాణం నరక యాతనగా మారిందని ద్విచక్ర వాహనచోదకులు అంటున్నారు. కరప మార్కెట్ సెంటర్ నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటుంది. పేపకాయలపాలెం వెళ్లే రోడ్డులో ఆటోలు నిలుపుతుంటారు. రోజు వారీ ట్రాఫిక్‌కు తోడు, మట్టి ట్రాక్టర్లు భీకరంగా తిరుగుతుండటంతో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఆస్పత్రికి, కోర్టులకు, ఇతర పనుల కోసం వెళ్లేవారు ట్రాఫిక్ జామ్‌తో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు, పోలీసు స్టేషన్ ముందు నుంచే మట్టి ట్రాక్టర్లు తిరుగుతున్నా, పట్టించుకోని అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. సంబంధిత అధికారుల ఇప్పటికైనా స్పందించి మట్టి ట్రాక్టర్లను అదుపు చేయాలని, ఉచితం వంకతో సాగుతున్న మట్టి వ్యాపారాన్ని అరికట్టాలని కోరుతున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అంటున్నారు.



పేపకాయలపాలెం నుంచి రాత్రివేళ మట్టిని తరలిస్తూ..



కరపలో సాగుతున్న మట్టి ట్రాక్టర్ల రాకపోకలు

పెద్దఎత్తున యోగా డే



సురేష్‌నగర్‌లో యోగాసనాల ప్రాక్టీస్

కాకినాడ సిటీ: మెగా యోగా డే సందర్భంగా ఈ నెల 21న స్థానిక నూకాలమ్మ గుడి నుంచి మూడు లైట్ల జంక్షన్ మీదుగా దేవదాయ శాఖ కార్యాలయం వరకు పెద్దఎత్తున యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు మూడు వేల మంది వివిధ ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, సిబ్బందితో ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. యోగాంధ్ర–2025 కార్యక్రమ ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి 8 నుంచి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఈ రోడ్డులో ట్రాఫిక్‌ను నిలుపుదల చేసి, ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులకు, దుకాణాల యజమానులకు సమాచారం అందించాలని, సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని పోలీస్ శాఖను నిర్దేశించారు.

యోగా డే కోసం ప్రాక్టీస్

కాకినాడ రూరల్: యోగా ఇంటర్నేషనల్ డే కార్యక్రమంలో పాల్గొనేందుకు కాకినాడ మూడో డివిజన్ సురేష్‌నగర్‌లో బుధవారం పెద్దఎత్తున ప్రాక్టీస్ చేశారు. తుమ్మలపల్లి నాని ఆధ్వర్యంలో యోగా మాస్టర్ హనుమాన్‌రెడ్డి సుమారు వంద మందితో యోగాసనాలు చేయించారు. సురేష్‌నగర్, ఆర్ఆర్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన జాతీయ బృందం



కొమరగిరి లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న సభ్యులు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ, కొమరగిరి గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం, పంచాయతీ నిధులతో చేసిన పనులను బుధవారం నేషనల్ మోనిటరింగ్ టీం సభ్యులు పరిశీలించారు. పొన్నాడలోని జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన గృహాల నిర్మాణం, సచివాలయ భవన నిర్మాణం, పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, ఉపాధి హామీ నిధులతో కాలువ నిర్మాణ పనులు, కాకినాడ అర్బన్ లబ్ధిదారులకు కొమరగిరిలో కేటాయించిన జగనన్న లేఅవుట్‌లో గృహాల నిర్మాణ పనులు, చెరువులో పూడికతీత పనులు, సచివాలయ నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. పొన్నాడ సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. గృహాల లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన పనులను నాణ్యతాపరంగా చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని టీం సభ్యులు అధికారులకు తెలిపారు. ఉపాధి కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలన్నారు. టీం సభ్యులు రుషి సింహ, బాలమురళి, జేసీ సునీత, ఏపీడీ వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా దేవదాయ శాఖాధికారి



కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసిన నాగేశ్వరరావు

కాకినాడ సిటీ: తూర్పుగోదావరి జిల్లా దేవదాయ శాఖాధికారిగా పని చేస్తూ, సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా దేవదాయ శాఖాధికారిగా కె.నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సుజాత



ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాతకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ బాలికల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.సుజాత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆమె బదిలీపై కాకినాడకు వచ్చారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమెకు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

వేద పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



సత్యదేవ మందిరంలో పూజలు చేస్తున్న వేదవరద్ధనతీర్థ స్వామీజీ

బోట్‌క్లబ్: వేదాలను పరిరక్షించడం ద్వారా హిందూ సనాతన ధర్మాన్ని కాపాడడమే కాకుండా, రానున్న తరానికి వాటి ప్రయోజనాలు అందించడానికి వీలుంటుందని ఉడిపి శిరూర్ మఠాధిపతి వేదవరద్ధనతీర్థ స్వామీజీ అన్నారు. స్థానిక గొడారిగుంటలోని సత్యదేవ మందిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వేద పరిరక్షణ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యమిచ్చేలా ప్రత్యేక ప్రాజెక్టును రూపకల్పన చేస్తున్నామన్నారు. దీనిని విజయవంతం చేయడానికి భక్తులు సహకరించాలన్నారు. వేద అఖిలం ధర్మమూలం అనే నినాదంతో వేద పరిరక్షణకు పలు కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. వేద మంత్రాలు ఉచ్ఛరించడం ద్వారా, వినడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందగలమన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సత్యదేవ మందిరంలో స్వామిజీ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధ్వ పురోహితులు యాతగిరి మధ్వేష్, మందిర నిర్వాహకులు యాతగిరి పరశురామ్ పాల్గొన్నారు.

తవ్వారు సరే.. పూడ్చేదిలాగా?



నాగమల్లితోట జంక్షన్ వద్ద రోడ్డు దిగబడడంతో ఏర్పడిన గొయ్యి

బోట్‌క్లబ్: ఏదో అవసరం వచ్చి రోడ్డుకు అడ్డంగా తవ్వారు సరే. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ ప్రధాన రహదారిలో ఆ గొయ్యిని సక్రమంగా పూడ్చకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం ఎదురుగా కాకినాడ–పామర్రు జాతీయ రహదారిపై రోడ్డుకు అడ్డంగా ఉన్న ఈ గోతుల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ గొయ్యిని తూతూమంత్రంగా సిమెంట్ వేసి వదిలివేశారు. దానిపై నుంచి వాహనాలు ప్రయాణించడంతో అది కాస్తా భారీ లోతులో దిగబడిపోయింది. ఈ క్రమంలో దీనిని సరిగ్గా గమనించకపోవడంతో నిత్యం ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గొయ్యి ఉన్న సంగతి తెలియక కొత్తగా ప్రయాణించే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనదారులు ఇక్కడ సడన్ బ్రేక్ వేసి ఆగడంతో.. వెనుక ఉన్న వాహనాలు అదుపుతప్పుతున్నాయి. తరచూ ఇక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. జిల్లా అధికారులూ ఇదే రహదారిలో ప్రయాణిస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం. ఆకస్మికంగా గొయ్యి మీదుగా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఈ గొయ్యిని పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మరిడమ్మ జాతరకు ఏర్పాట్లు

పెద్దాపురం: పట్టణంలో ఈ నెల 24 నుంచి మరిడమ్మ జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేయాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. స్థానిక మరిడమ్మ ఆలయ కాలక్షేప మండపంలో బుధవారం ఈఓ విజయలక్ష్మి అధ్యక్షతన ప్రజా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఈ నెల 24వ తేదీ నుంచి జరిగే మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ, అమ్మవారి జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఆయా శాఖల సిబ్బంది జాతర ఏర్పాట్లు పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సై మౌనిక, ప్రతినిధులు పాలమరశెట్టి సత్తిబాబు, రంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వంద పడకలేనా..?



పెద్దాపురంలో వంద పడకల ఆస్పత్రి అనుమతికి సిద్ధంగా ఉన్న భవనం

- నెరవేరని ఆస్పత్రి అభివృద్ధి
- పీడిస్తున్న వైద్యుల కొరత
- 20 ఏళ్లుగా కాగితాలకే పరిమితం
- అందుబాటులోకి రాని సేవలు

పెద్దాపురం: ఏళ్ల తరబడి పెద్దాపురం వంద పడకల ఆస్పత్రి సేవలు కలగా మిగిలిపోయాయి. ఇది ప్రతిపాదనల వద్దే ఆగిపోతుంది మినహా.. కార్యరూపం దాల్చడం లేదు. డివిజన్ పరిధిలోని పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి మండలాలతో పాటు, అనపర్తి నియోజకవర్గంలోని రంగంపేట మండలం నుంచి ప్రజలు వైద్యం కోసం ఈ ఏరియా ఆస్పత్రికి వస్తుంటారు.

పెద్దాపురం నడిబొడ్డున ఉన్న ఆస్పత్రిని మాజీ ఎమ్మెల్యే బొడ్డు భాస్కర రామారావు హయాంలో పట్టణ శివారు రాజమహేంద్రవరం రహదారిలో పాండవుల మెట్ట సమీపంలో సామాన్య ఆస్పత్రి భవన నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి ఆస్పత్రి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్, వంద పడకల ఆస్పత్రి ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రస్తుత ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంత్రిగా ఉన్నప్పుడు ఏరియా ఆస్పత్రి బోర్డు మార్చారే కానీ, వంద పడకల ఆస్పత్రి ప్రతిపాదన మాత్రం కార్యరూపం దాల్చలేదు. ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయింది కానీ, వంద పడకలు, ఆస్పత్రి సేవలు మాత్రం నిలిచిపోయాయి. అప్పట్లోనే వంద పడకల ఆస్పత్రి ప్రతిపాదన తెరపైకి వచ్చినా, కొంతకాలానికే అనపర్తికి మారిపోయింది. తదుపరి ప్రత్తిపాడుతో కలిపి పెద్దాపురం వంద పడకల ఆస్పత్రి ప్రతిపాదన అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

పిఠాపురానికి అనుమతి!

ఈసారి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన నియోజకవర్గమైన పిఠాపురానికి వంద పడకల ఆస్పత్రి అనుమతి రావడంతో, పెద్దాపురం ప్రతిపాదన పూర్తిగా పడకేసింది. ప్రస్తుతం కూటమి నాయకులు చోద్యం చూడడం మినహా దీని ఊసెత్తకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. పెద్దాపురం ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే చినరాజప్ప అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపాదన చేశారు. అయినా వంద పడకల ఆస్పత్రి కలగానే మిగిలిపోయింది. గతంలో అనపర్తి, ప్రత్తిపాడు, ప్రస్తుతం పిఠాపురం ఆస్పత్రులకు వంద పడకల అనుమతి లభించింది కానీ, ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పెద్దాపురం వంద పడకల ఆస్పత్రి మాత్రం ప్రశ్నార్థకంగా మారింది.



ఏరియా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న రోగులు

గత ప్రభుత్వ హయాంలో..

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తూ, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెరుగైన వైద్య సేవలందించారు. సిబ్బంది కొరత లేకుండా చేయడమే కాకుండా, స్థానిక పాత ఆస్పత్రి ఆవరణలో, బంగారమ్మ గుడివీధిలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించారు. పట్టణంలో సగం మంది ఆయా అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆ రెండు అర్బన్ హెల్త్ సెంటర్లలో కనీస వసతులు కల్పించలేకపోవడం గమనార్హం. ఇక్కడ రెగ్యులర్ వైద్యులను నియమించాల్సి ఉంది.

కొందరు వైద్యులతోనే..

స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ సూపరింటెండెంట్, గైనిక్, ఆర్థోపెడిక్ వైద్యులు అన్ని సేవలు అందించాల్సి వస్తోంది. ప్రధానంగా జనరల్ ఫిజీషియన్, చంటి పిల్లల వైద్యులు, జనరల్ సర్జన్, ఎస్ఆర్‌హెచ్‌ఎం కొరత ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఎస్‌బీఎస్‌యూ (న్యూ బోర్న్ సర్వీస్ యూనిట్) ఎంబీబీఎస్ రెగ్యులర్ వైద్యులతో మెరుగైన వైద్య సేవలందించారు. ప్రస్తుతం అవేమీ ఇక్కడ కానరావడం లేదు.